సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ వైద్య సేవలు

ఎంపీ ఈటల రాజేందర్


చెక్కు అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ వైద్య సేవలు అందుతాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొంపల్లికి చెందిన ప్రేమావతికి బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ పాతూరి శివాజీ రాజు రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. అంతే కాకుండా ఎంపీ ద్వారా మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్‌చెక్కును గురువారం అందజేవారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాధురి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వినతి



నిజాంపేట్: ఇందిరమ్మ ఫేజ్ 3 లోని పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేసి, ప్రజా అవసరాల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్క్ స్థలం కబ్జాకు గురి కాకుండా కాపాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశి యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుక



చింతల్: చింతల్ రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. రెయిన్‌బో జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. విద్యార్థులకు ధీటుగా కళాశాల మహిళా అధ్యాపకులు, సిబ్బంది సైతం ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ శాంతి కుమార్ యాదవ్, కళాశాల డైరెక్టర్ స్నేహలత యాదవ్, ప్రిన్సిపాల్ హేమలతారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక.. సన్మానం


రాజారావును సన్మానిస్తున్న దృశ్యం

నిజాంపేట్: బాచుపల్లి మండలంలోని ఇందిరా నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన రాజారావు రాష్ట్రస్థాయి టీఎల్ఎం మేళాకు ఎంపికయ్యారు. తన మేధస్సును ఉపయోగించి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు వివిధ గణిత భావనలు సులభంగా బోధించే విధంగా మల్టీ కాంసెప్ట్ బాక్స్ అనే టీఎల్ఎం పెట్టెను తయారు చేశారు. రాజారావు ఎంపిక పట్ల పీఆర్‌టీయూటీఎస్ బాచుపల్లి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నర్సిములు, మాలి ప్రమోద్ కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరారావు, శివప్రసాద్, పద్మజ లత, సునీత తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి

దుండిగల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సుంకరి సత్తయ్య (ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పెద్దనాన్న) దశదిన కర్మ గురువారం శంభీపూర్‌లో జరిగింది. మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూధనాచారి, ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ బాలమల్లు సత్తయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించి.. డంపింగ్ చేసి !

స్క్రాప్ వ్యాపారుల బరితెగింపు.. అధికారుల అలసత్వం.. వెరసి రోడ్లు బ్లాక్.. రాకపోకలు సాగించే వాహనదారులకు తిప్పలు.. ప్రశ్నిస్తే బెదిరింపులు..చివరకు ప్రజల కోసం వేసిన రోడ్లు సైతం వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయంటే ఇక్కడ అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఓవైపు కుత్బుల్లాపూర్ మున్సిపల్ అధికారులు, మరోవైపు ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ అధికారుల అలసత్వం ఇక్కడ కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్లపై ఉన్న ప్లాస్టిక్ సంచుల డంపింగ్‌లను తొలగించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

– జీడిమెట్ల

- తుక్కును డంప్ చేస్తున్న వ్యాపారులు
- రాకపోకలకు అంతరాయం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


రోడ్డుపై డంప్ చేసి ఉంచిన వ్యర్థాలు..


డ్రమ్ములతో రోడ్డు బ్లాక్ చేసిన ప్రాంతం

రోడ్లపై ప్లాస్టిక్ సంచులు, డ్రమ్ములు

ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ పారిశ్రామికవాడ, సుభాష్‌నగర్ వెంకటాద్రినగర్‌లో కొంతమంది ప్లాస్టిక్ స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. 200 గజాల నుంచి 300 గజాల్లో షెడ్లు నిర్వహించే వీరంతా లోపల స్థలం లేకపోవడంతో రోడ్లపై ప్లాస్టిక్ నింపిన సంచులను, డ్రమ్ములను డంప్ చేసి పెడుతున్నారు. దీంతో రోడ్లన్నీ బ్లాక్ అవ్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు వాహనాలు వెళ్లలేక ట్రాఫిక్‌జాం అవుతుంది. వాహనాలు ఎటూ వెళ్లలేక గంటల వ్యవధి అక్కడే ఉండాల్సి వస్తుంది.

ఫిర్యాదులు చేసినా స్పందన కరువు

రోడ్లపై ప్లాస్టిక్ వ్యర్థాలను డంప్ చేసి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు మున్సిపల్, సొసైటీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వ్యాపారుల వద్ద అమ్యామ్యాలు తీసుకుంటూ మిన్నకుండిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్క్రాప్ వ్యర్థాలను తొలగించాలి



మేము 20 సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో ఉంటున్నాం. ఎన్నడూ లేని విధంగా 3 సంవత్సరాలుగా రోడ్లపై వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్లపై డంపింగ్ చేసిన వ్యర్థాలను తొలగించాలి.

– లక్ష్మి, వెంకటాద్రినగర్ అధ్యక్షురాలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి


ప్రాథమిక పాఠశాలలో పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. గురువారం జీడిమెట్ల డివిజన్ అయోధ్య నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ అభియాన్ నియోజకవర్గ కో కన్వీనర్ వేముల రమేష్, డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజులతో కలిసి స్వచ్ఛ అభియాన్‌లో చెత్తాచెదారాలను తొలగించారు. కార్యక్రమంలో నార్లకాంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, అంజయ్య, వీరేశం, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని తొలగించాలి

జీడిమెట్ల డివిజన్ పరిధి శ్రీనివాస్ నగర్ ఫేజ్ 2, ఫేజ్ 3 లో బుధవారం కురిసిన భారీ వర్షానికి వరద నీళ్లు ఇళ్లలోకి చేరడంతో గురువారం ఆయా కాలనీల్లో భరతసింహారెడ్డి పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్‌లు చేసి వరదనీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్లేశ్వర్ రావు, నరేందర్ రెడ్డి, సురేందర్, అశోక్, పద్మనాభం, వీరయ్య, యశోద పాల్గొన్నారు.

సెల్లార్ గుంతలో పడి వ్యక్తి మృతి..

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి వర్షపు నీటితో నిండిన సెల్లార్ గుంతలో పడి మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సంగారెడ్డి జిల్లా,నమలిమెట్ గ్రామానికి చెందిన బొక్క రామయ్య(45) పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్నాడు. మద్యం మత్తులో అతను గురువారం ఉదయం ప్రమాదవశాత్తు తన ఇంటి సమీపంలోని పాత సెల్లార్ గుంతలో పడ్డాడు. సెల్లార్ గుంతలో నీళ్లు ఉండటంతో అతడిని బయటికి తీసేందుకు భార్య, కుమారుడు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈత రాని కారణంగా రామయ్య నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

జగద్గిరిగుట్ట: గాజులరామారం సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో సుమారు 2 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. షిరిడీ హిల్స్‌లో రూ. 42 లక్షలు, గాజులరామారం విలేజ్‌లో రూ.47 లక్షలు, భవానీ నగర్‌లో రూ.41 లక్షలు, సెవెన్ హిల్స్ కాలనీలో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు పనులతో పాటు వివిధ కాలనీలలోని రోడ్ల మరమ్మతులకు రూ.10 లక్షలతో బీటీ రోడ్డు పనులు, రూ.22 లక్షలతో లెనిన్ నగర్‌లో కల్వర్టు పనులు మొదలుకానున్నాయి. టెండర్లు పూర్తి అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని గాజులరామారం సర్కిల్ ఏఈ తిరుపతి తెలిపారు.

మార్వాడీలకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు

సుభాష్‌నగర్: మార్వాడీలు అధైర్యపడొద్దని, వారికి అండగా ఉంటానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఇటీవల మార్వాడీ హటావో విషయమై దూలపల్లిలోని ఆయన నివాసంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మార్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

◆ ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదన్నారు. గ్రేటర్ హైదరాబాదు మినీ ఇండియా అని, వివిధ రాష్ట్రాలలో మన తెలంగాణ వారు స్థిర నివాస ఏర్పచుకొన్నారని, వారిని గో బ్యాక్ అనడం సరైన పద్ధతి కాదన్నారు. ఎక్కడో జరిగిన పొరపాటు ఇక్కడ రుద్దడం సరికాదన్నారు. సమావేశంలో డీసీసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత



సుభాష్‌నగర్: ఎన్ని అడ్డంకులు వచ్చినా చదువుకు దూరం కావద్దని సత్యసాయి సేవా సమితి సభ్యులు జయప్రకాష్ అన్నారు. గాజుల రామారం డివిజన్ బాలయ్యనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో గురువారం సత్యసాయి సేవా సమితి జీడిమెట్ల ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు జయప్రకాష్, జీడిమెట్ల కన్వీనర్ నాగేశ్వరరావు, గాజులరామారాం కన్వీనర్ రాములు, బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేష్, టీచర్స్ హరితారెడ్డి, జయలక్ష్మి, పార్వతి, సునీల్ కుమార్ వర్మ పాల్గొన్నారు.

పాత కక్షలతో వ్యక్తి దారుణహత్య!

కుత్బుల్లాపూర్ : రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని పాత కక్షల నేపథ్యంలో మందలించి దాడి చేయగా.. సదరు వ్యక్తి తన సోదరుడితో పాటు మరో నలుగురిని తీసుకువచ్చి రాడ్లతో దాడి చేశాడు. దీంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి చావు బతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దూలపల్లి పారిశ్రామిక వాడ స్టీల్ సిటీలో ఓ షెడ్డు వద్ద అదే ప్రాంతానికి చెందిన దుర్గం శ్రీకాంత్ గౌడ్‌తో పాటు అతని స్నేహితుడు అలీ ఉన్నాడు. ఇదే క్రమంలో ఆనంద్ అనే వ్యక్తి అటువైపుగా వెళుతూ అలీ కంటపడ్డాడు. అప్పటికే వీరిద్దరి మధ్య గొడవలు ఉండటంతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో ఆనంద్ అక్కడి నుంచి వెళ్లి తన సోదరుడితో పాటు మరో నలుగురిని తీసుకువచ్చి రాడ్లతో విచక్షణా రహితంగా ఇద్దరిపై దాడి చేశారు. దీంతో శ్రీకాంత్ గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అలీకి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ బాలగంగిరెడ్డి, సీఐ విజయ వర్ధన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గతంలో దుర్గం శ్రీకాంత్ గౌడ్‌కు సంబంధించిన స్థల వివాదం ఐదు సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తుంది. ఈ స్థల వివాదంలో వచ్చిన గొడవ కారణంగా హత్య జరిగిందా?, అలీ, ఆనంద్ మధ్య ఉన్న పాత కక్షలు నేపథ్యంలో జరిగిందా? అన్న విషయంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం ఒక బృందాన్ని నియమించారు.

సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: కాలనీల్లో వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ సింహపురి కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా అవరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చిట్ల దివాకర్, ఎన్ఎంసీ జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, వీరబాబు, ఆదిరెడ్డి, నారాయణరెడ్డి, వాసు, ఆంజనేయవర్మ, శ్రీనివాస్, రఫాత్, ప్రశాంత్‌రెడ్డి, సందీప్, మహేష్, కాలనీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, రామ్‌కుమార్, సత్యనారాయణరావు, శ్రీనివాస్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నాటి నిజాం.. నేటి మోదీ పాలన ఒక్కటే

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

నిజాంపేట్: నాటి నిజాం పాలన, నేటి మోదీ సర్కార్ పాలనలో తేడా ఏమీ లేదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య అన్నారు. గురువారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. పరేడ్‌గ్రౌండ్ సభలో కేంద్రమంత్రి రాజనాథ్ సింగ్ అన్ని అబద్ధాలే మాట్లాడారన్నారు. విమోచన దినం అనేది పెద్ద అబద్ధం అని, ట్రంప్ పెత్తనం చేస్తుంటే మోదీ తల వంచుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రులకు దేశ భక్తులుగా చెప్పుకునే అర్హత లేదని, అది దేశ ద్రోహుల గ్యాంగ్ అని అన్నారు. హైదరాబాద్ పోరాటంలో బీజేపీ ఆనవాళ్లులేవని, నాటి రజాకార్లకు, నేటి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు పెద్ద తేడా లేదన్నారు.

మానవ విలువలపై అవగాహన


అవగాహన సదస్సుకు హాజరైన అధ్యాపకులు

దుండిగల్: మానవ విలువలు అనేవి దయ, నిజాయితీ, ప్రేమ, శాంతి వంటి మానవులకు సహజంగా ఉండే ప్రాథమిక నైతిక లక్షణాలని, అవి సమాజానికి, వ్యక్తికి మంచితనాన్ని పెంపొందిస్తాయని కొచ్చిన్‌యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏఐసీటీఈ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రపంచ మానవ విలువలపై అవగాహన సదస్సు గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విలువలనేవి వ్యక్తి యొక్క ప్రవర్తనను, ఉద్దేశాలను నిర్దేశిస్తాయని, జీవితంలో ఏం ముఖ్యమో నిర్ణయించ డానికి సహాయపడతాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి శ్రీధర్, నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్ గుప్తా, డా. ఇస్రత్ మీరా, చాముండేశ్వరి, డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


చెరువు ప్రాంతాల్లోని ప్రజలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట్: వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ సెక్రటరీ కొలను జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం కురిసిన భారీ వర్షాలకు బాచుపల్లి బైరుని చెరువులోకి వరద భారీగా చేరడంతో చెరువు పరిసర ప్రాంతంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుసగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. హైడ్రా అధికారులకు పరిస్థితిని వివరిస్తున్నామని పేర్కొన్నారు. వర్షాలు తగ్గే వరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితులను కమిషనర్‌కు వివరించారు. తక్షణమే స్పందించిన అధికారులు, స్థానిక నాయకుల సహకారంతో వరద ముప్పులో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కొలన్ బాల్‌రెడ్డి, గొంగుల జిత్తు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. ఆగమాగం


రామచంద్రయ్య కాలనీలో..


భగత్‌సింగ్‌నగర్‌లోని 53వ గల్లీని ముంచెత్తిన వర్షపునీరు

- స్తంభించిన రాకపోకలు
- ట్రాఫిక్‌ను మళ్లించిన పోలీసులు
- చెరువులను తలపించిన రహదారులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం కురిసిన వర్షానికి జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రోడ్లతో పాటు కాలనీలు, బస్తీలను వరదనీరు ముంచెత్తింది. పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోకి భారీగా వరద నీరు చేరింది. ప్రధాన రహదారులపై చేరిన మోకాల లోతు వరదనీటిలో ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల గుంతల్లోకి వరదనీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను మళ్లించారు.


ప్రగతినగర్ వాసవీ లేఅవుట్‌లో నిజాంపేట్ వెళ్లే రోడ్డులో..


రంగారెడ్డినగర్ బస్టాప్ వద్ద ముంచెత్తిన వరదనీరు


వాహనాలను మళ్లిస్తున్న ట్రాఫిక్ పోలీసులు


మల్లంపేట్ నుంచి బాచుపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డులో..


బిహారీబస్తీలో నీట మునిగిన ప్రభుత్వ పాఠశాల


మల్లంపేట్‌లోని రత్నదీప్ వద్ద..